క్లుప్తంగా

మొక్కజొన్న దిగుబడికి నిప్పు



కాలిపోయిన పంట వద్ద రైతు బాబయ్య

మద్దికెర: మద్దికెర– ఎం.అగ్రహారం గ్రామ రహదారిలో ఉన్న పింజరి బాబయ్య అనే రైతు పొలంలో శుక్రవారం ప్రమాదవశాత్తు పంట దిగుబడికి నిప్పంటుకుని రూ.50 వేలు విలువ చేసే ధాన్యం, రూ.50 వేలు విలువైన డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. గురువారం బాబయ్య పంటను కోసి కుప్పగా పోసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం మిషన్ పట్టించేందుకు పొలానికి వెళ్లగా దిగుబడి మంటలకు ఆహుతై కనిపించింది. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేస్తే చేతికి అందే సమయంలో మంటల్లో కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

8 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

తుగ్గలి: మండల పరిధిలోని నుసురాల్లలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు సోమలింగేశ్వరస్వామి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. 8, 9వ తేదీల్లో హోమాలు, ప్రత్యేక పూజలు గ్రామోత్సవం, 10న స్వామి, దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు. శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరుపాక్ష విద్యారణ్య సంస్థాన పీఠాధిపతి విద్యారణ్య భారతీ స్వామిచే ప్రతిష్ఠ పూజ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతిష్ఠ పురస్కరించుకొని 8న పురుషుల, మహిళల కబడ్డీ పోటీలు, వీరబ్రహేంద్ర స్వామి నాటకం, 9న చింతామణి నాటకం, వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు, 10న భజన పోటీలు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అందుబాటులో విత్తనాలు

కృష్ణగిరి: మండల పరిధిలోని అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక కార్యాలయంలో వివిధ గ్రామాల రైతులతో మాట్లాడారు. సబ్సిడీ వేరుశనగ, కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని వెంటనే తీసుకెళ్లవచ్చన్నారు. ప్రతి రైతుకు గరిష్ఠంగా మూడు ప్యాకెట్లు ఇస్తున్నామని, మరో వారం రోజుల్లో వర్షం పడితే కంది, ఆముదం, పత్తి పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు.

ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: హాలహర్వి మండలంలోని శ్రీధర్‌హాల్ గ్రామంలో శివాలయం నిర్మాణానికి ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ రూ.50 వేలు విరాళం అందించారు. శుక్రవారం తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

గెస్ట్‌ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

పత్తికొండటౌన్: పత్తికొండ ఏపీ రెసిడెన్షియల్ ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాల ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఓ.ఎస్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పీజీటీ–ఇంగ్లిష్, పీజీటీ–సోషల్ సైన్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులు, బీఈడీలో 50శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 99899 49992 సెల్ నంబరును సంప్రదించాలని సూచించారు.

వస్త్ర వ్యాపారి అరెస్ట్

ఆదోని అర్బన్: పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారి మహావీర్‌జైన్‌ను శుక్రవారం గుజరాత్ పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్ తెలిపిన వివరాలు.. గుజరాత్ రాష్ట్రం సూరత్‌కు చెందిన విజయ రమాకాంత్‌మోర్యా అనే వ్యాపారి వద్ద ఆదోనికి చెందిన మహావీర్‌జైన్ రూ.13 లక్షలు విలువైన సరుకు కొనుగోలు చేశాడు. దీనికి సంబంధించి నగదు ఇవ్వకుండా మోసం చేసి తిరుగుతున్నాడని సూరత్‌లో గత మార్చి 24న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సూరత్ పోలీసులు వారెంట్‌తో వచ్చి ఆదోని టూటౌన్ పోలీసుల సహకారంతో మహావీర్ జైన్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

ఆస్పరి: మండలంలోని ముత్తుకూరు గ్రామంలో టీటీడీ దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన ధార్మిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. గ్రామంలో సర్పంచ్ తోయజాక్షప్ప అధ్యక్షతన నాలుగు రోజులుగా టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి శ్రీమద్రామాయాణం, మహా భారతం, శ్రీమద్భగవద్గీత గురించి ప్రజలకు వివరించారు. శుక్రవారం కుంకుమార్చన, గోపూజతో కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు కోర్సుల ఎంపిక కీలకం

- పదో తరగతి పూర్తయిన విద్యార్థుల్లో గ్రూపుల ఎంపికపై సందిగ్ధం
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాల్సిందే
- సరైన ప్రణాళికతో ఉజ్వల భవిష్యత్తు

ఎమ్మిగనూరుటౌన్: పదో తరగతి పరీక్షా ఫలితాలు వెలువడడం, వేసవి సెలవులు ముగుస్తుండడంతో తరువాత ఏ కోర్సులను ఎంపిక చేసుకోవాలని, చదువులను ఎలా కొనసాగించాలని విద్యార్థులు సందిగ్ధపడుతుంటారు. ఇంటర్మీడియెట్‌లో ఏ గ్రూపు తీసుకోవాలి. ఏ గ్రూపు తీసుకుంటే భవిష్యత్ బాగుంటుంది. ఎవరిని అడగాలి. అనే సందేహాలతో సతమవుతుండటం సహజం. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఉన్నత చదువులు చదివేందుకు వారధి ఇంటర్మీడియెట్. ఇందులో గ్రూపు ఎంపిక అత్యంత కీలకమైన అంశం. విద్యార్థులు తమకు ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకోవడానికి ప్రాధాన్యత నివ్వాలి. ప్రణాళికబద్ధంగా చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోవడానికి సులభతరమవుతుందని విద్యావంతులు సూచిస్తున్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు పట్టణంలో బాలికల, బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వివిధ గ్రూపులను నిర్వహిస్తోంది. ఇంటర్మీడియెట్ చదవాలనుకునే విద్యార్థులు ఏ గ్రూపులో చేరితే ఏ సబ్జెక్టులు ఉంటాయి. తదనంతరం ఆయా గ్రూపుల్లో ఉత్తీర్ణులైన వారికి ఎలాంటి కొలువులు లభిస్తాయి అన్న అంశాల గురించి ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు వివరించారు.

బైపీసీ: ఎంసెట్, నీట్ పరీక్షల ద్వారా డాక్టర్, వైద్య సంబంధిత వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలనుకునే వారికి బైపీసీ గ్రూపు ఎంతో ఉపకరిస్తుంది. అదేవిధంగా అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులకు ఈ గ్రూపు ప్రతిపాదిక. ఓపికగా చదవడం, స్పష్టంగా సైన్స్ ప్రతిపాదికన బొమ్మలు వేయడం లాంటివి ఈ గ్రూపు విద్యార్థులకు ఉండాల్సిన లక్షణాలు.

ఎంపీసీ: ఇంజినీరింగ్ రంగంలో స్థిరపడాలనుకునే వారు తీసుకోవాల్సిన గ్రూపు ఎంపీసీ. ఎంసెట్ రాసి సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఎరోనాటికల్స్ తదితర రంగాల్లో ఇంజినీరింగ్ చేయాలనుకునే వారికి ఈ గ్రూపు పునాదిలాంటిది.

ఎంఈసీ, సీఈసీ: ఈ గ్రూపు సేవా రంగం వైపు వెళ్లే వారు తీసుకోవచ్చు. మ్యాథ్స్, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టులు ఈ గ్రూపులో ఉంటాయి. చార్టెడ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కమర్షియల్ ఏజెంట్లు, బ్యాంకులలో పలు విభాగాల్లో ఉద్యోగాలు పొందాలనుకుంటే ఈ గ్రూపు ఎంతో ఉపకరిస్తుంది. స్టాక్ మార్కెట్‌లలో ఉద్యోగాలు పొందాలనుకునే వారు కూడా ఈ గ్రూపులను తీసుకోవచ్చు.

ఐటీఐ: ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోర్సులను ఎంచుకోవడం ద్వారా విద్యార్థులు పదో తరగతి తరువాత రెండేళ్ల సాంకేతిక విద్యలో నైపుణ్యం పొందవచ్చు. ఎలక్ట్రికల్, డీజిల్ మెకానిక్ తదితర కోర్సులు పూర్తయిన వెంటనే ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యారంగంలో ఉన్నత స్థాయి కోర్సులు చదివే అవకాశం ఉంటుంది.

పాలిటెక్నిక్: పదో తరగతి తరువాత ఏదైనా సాంకేతిక విద్యలో నైపుణ్యం సంపాదించాలంటే ఉత్తమ మార్గం పాలిటెక్నిక్. ఇందుకోసం విద్యార్థులు పాలిటెక్నిక్‌లో ఎంట్రన్స్‌లో అర్హత సాధించాలి. మెరిట్ ఆధారంగా ఇందులో సీట్లు కేటాయిస్తారు.



ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

ఆసక్తి ఉన్న గ్రూపులను ఎంచుకోవాలి



పది పాసైన విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో తమకు ఆసక్తి కలిగిన సబ్జెక్టులు ఉండే గ్రూపులను ఎంచుకోవాలి. భవిష్యత్తులో ఏ రంగం వైపు వెళ్లాలనుకుంటున్నారో నిర్ణయించుకుని అదే లక్ష్యంతో కోర్సులను ఎంపిక చేసుకొని చదవాలి. ఏది పడితే అది, ఒకరిని చూసి మరొకరు పోటీపడి కోర్సులను ఎంపిక చేసుకొని కెరియర్‌ను పాడుచేసుకోకూడదు. ఇష్టమైన సబ్జెక్ట్‌లను ఎంచుకొని అందులో రాణించాలి. ఎమ్మిగనూరు బాలికల కళాశాలలో అన్ని గ్రూపులున్నాయి. ఆయా గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసేందుకు జూన్ 14వ తేదీ వరకు గడువు వుంది. – విజయరాణి, ప్రిన్సిపాల్, బాలికల జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు

పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తుగ్గలి : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తుగ్గలి జెడ్పీ ఉన్నత పాఠశాల, నోవీ కాన్సెప్ట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో తొలి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 75 మంది విద్యార్థులకు గాను 60 మంది పరీక్షకు హాజరైనట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ రామవెంకటేశ్వర్లు తెలిపారు.

ముగ్గురు గైర్హాజరు

మద్దికెర: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు మొదటి రోజు మొత్తం 42 మంది విద్యార్థులకు గాను ముగ్గురు గైర్హాజరైనట్లు చీఫ్ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర: మలేరియా వ్యాధి పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి నగేష్ సూచించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకొని శుక్రవారం మద్దికెరలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యశాలలో సిబ్బందికి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామాలలో వైద్య సిబ్బందితో పాటు ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి డీడీటీ మందులు పిచికారీ చేయించాలని, ఖాళీ టైర్లు, కుండీలు, తొట్టెలు, డ్రమ్ముల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సీహెచ్‌ఓ నిరంజన్‌బాబు, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ విజయవంతంపై హర్షం



వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి జయరాం

ఆలూరు: ప్రజలు, రైతులు, కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. స్థానిక మంత్రి నివాసంలో శుక్రవారం వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు, వ్యవసాయ కార్మికులు, అట్టడుగు వర్గాల వారి కోసం సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. జిల్లాలో వరుసగా ఐదో ఏడాది రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో రూ.155.81 కోట్లను జమ చేశారని వివరించారు. పతికొండలో సీఎం నిర్వహించిన రైతు భరోసా సభ విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాని మంత్రి చెప్పారు. గత నెల 31వ తేదీన మాల కులస్తులు నిర్వహించిన గర్జన సభకు మంత్రి జయరాం రూ.50 వేలు విరాళంగా అందజేయడంతో ఆ సంఘం నాయకులు మహానంది, ఈరన్న, లక్ష్మీనారాయణ, గోపాల్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎంకు కృతజ్ఞతలు

- పత్తికొండకు నిధుల మంజూరుపై ఎమ్మెల్యే శ్రీదేవి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన విజయవంతంపై హర్షం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: పత్తికొండ పర్యటనలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.100 కోట్లకు పైగా నిధులు మంజూరుచేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తెలిపారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. సీఎం పత్తికొండ పర్యటన విజయవంతం అయ్యిందన్నారు. అంచనాలకు మించి జనం తరలివచ్చి జననేతపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం అడిగినవన్నీ మంజూరు చేస్తూ రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఇందుకు నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు రూ.10 కోట్లు, హంద్రీ–నీవా ప్రధాన కాలువకు లిఫ్ట్ ఏర్పాటుచేసి పత్తికొండ మండలంలోని 6 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.80 కోట్లు, పట్టణంలో బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ నిర్మాణానికి రూ.1.75 కోట్లు, కృష్ణగిరి మండలం గోకులపాడు వద్ద హంద్రీనదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.5 కోట్లు, ఉల్లిపాయలపొడి తయారీ యూనిట్ల ఏర్పాటుకు ఆదేశం, కంబాలపాడు–కోయిలకొండ, మారెళ్ల–బొందిమడుగుల రోడ్లలో బ్రిడ్జిల నిర్మాణం, మరమ్మత్తులకు రూ.కోటి మంజూరు చేయడం ఆనందంగా ఉందన్నారు. సీఎం సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, జేసీ, ఎస్పీ, సబ్ కలెక్టర్, అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ నారాయణదాసు, నాయకులు సోమశేఖర్, పల్లె ప్రతాప్‌రెడ్డి, కారం నాగరాజు, లలితా రామచంద్ర, రహిమాన్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

హైవేపై విద్యుత్ వెలుగులు



హైవేపై విద్యుత్ దీపాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపల్ శాఖ హైవేపై విద్యుత్ దీపాలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆదోని రోడ్డులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ గౌస్ నుంచి మంత్రాలయం రోడ్డులోని పద్మనాభ స్వామి ఆలయం వరకు నేషనల్ హైవే–167 రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్‌దీపాలను శుక్రవారం రాత్రి స్థానిక ఓంశాంతి సర్కిల్ వద్ద మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘులతో కలిసి ఎమ్మెల్యే స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. హైవేలో సెంట్రల్ లైటింగ్‌తో పాటు రంగురంగుల ఎల్‌ఈడీ విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయడంతో వాటిని తిలకించేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన రాయితీలపై అవగాహన



పూలచింత గ్రామంలో ఫారంపాండ్ పనులు పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

నందవరం: రైతులు ఉద్యాన శాఖ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి పి.రామాంజనేయులు సూచించారు. శుక్రవారం పూలచింత గ్రామంలో రైతు సురేష్‌గౌడ్ పొలంలో ఫారంపండ్ పనులను ఉద్యానశాఖ అధికారులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సమగ్ర ఉద్యాన అభివృద్ధి పథకం ద్వారా రైతులకు రాయితీతో సొంతంగా ఫారంపాండ్ నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఫారంపాండ్ నిర్మాణానికి రూ.1.50 లక్షలు మంజూరు చేస్తుందని, అందులో రూ.75 వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోట పెంపకానికి 100 శాతం రాయితీ కల్పిస్తోందని వివరించారు. ఎమ్మిగనూరు ఉద్యానశాఖ అధికారిణి శ్రీవాణి, వీఏఏ రామమూర్తి పాల్గొన్నారు.

ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి



నిర్మాణం పూర్తయిన ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రి భవనం

ఆలూరు రూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన భవనం సిద్ధమైంది. రూ.1.76 కోట్ల నాబార్డు నిధులతో సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. ఇక్కడ ఉన్న ఆస్పత్రి పాత భవనం శిథిలావస్థకు చేరడంతో పాటు అసౌకర్యాలతో రోగులు ఇబ్బంది పడేవారు. ఆలూరు సీహెచ్‌సీ పరిధిలో 6 పీహెచ్‌సీలు, 11 హెల్త్ సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న రోగులు, గర్భిణులు మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి వస్తుంటారు. అలాగే రోడ్డు ప్రమాదాల బారిన పడ్డవారు. వివిధ కారణాలతో రోగాలతో వచ్చే వారితో కలిపి రోజు 200 మంది ఔట్ పేషెంట్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటారు.

త్వరలో అందుబాటులోకి నూతన భవనం

ఆధునిక సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనం త్వరలో అందుబాటులోకి రానుంది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆస్పత్రిని ప్రారంభించనున్నారు. నూతన భవనంలో రెండు డాక్టర్ గదులు, ఒక ఫార్మసిస్ట్ గది, స్టాఫ్ నర్స్ గది, ఆపరేషన్ థియేటర్, 10 పడకల సామర్థ్యం గల రెండు వార్డులు, డెలివరీ రూంతో పాటు ఒక వెయిటింగ్ హాల్ నిర్మించారు. దీంతో రోగుల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోనున్నాయి. అలాగే వెంటిలేటర్, ఎక్స్‌రే, ఈసీజీ, ల్యాబ్‌కు సంబంధించిన అన్ని పరికరాలు అందుబాటులో రానున్నాయి.

హత్యకేసులో ఐదుగురి అరెస్ట్

ఎమ్మిగనూరురూరల్: నందవరం మండలం ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన బోయ పెద్ద ఈరన్న హత్యకేసులో ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. బోయ పెద్ద ఈరన్నకు అదే గ్రామానికి చెందిన బోయ నడిపి నరసింహులుకు కొంతకాలంగా పొలంలో, ఇంటి ముందు కాలువ విషయంలో గొడవలు ఉన్నాయన్నారు. ఇది మనసులో పెట్టుకొని మే 6న పెద్ద ఈరన్నను నరసింహులు, నాగేష్, పాల్‌రెడ్డి, వినోద్, మాచాపురానికి చెందిన గాలెన్న కత్తితో గొంతు కోసి వెళ్లిపోయినట్లు తెలిపారు. ఈరన్న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మే 18న మృతి చెందడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. నదికైరవాడి క్రాస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితులను అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. సీఐతో పాటు నందవరం ఎస్ఐ మహేష్‌కుమార్, తదితరులు ఉన్నారు.

రైతు సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

వెల్దుర్తి: సీపీఐ అనుబంధ ఏపీ రైతు సంఘం బోగోలు గ్రామ కమిటీ ఎన్నిక శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగింది. సీపీఐ మండల కార్యదర్శి టి.కృష్ణ, రైతు సంఘం కార్యదర్శి మాధవకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వరరెడ్డి, కుల్లాయప్ప, చిన్నగిడ్డయ్య, మరో ఐదుగురు ప్రతినిధులు ఏకగ్రీవమయ్యారు. గ్రామ సమస్యల సాధనకు నూతన కమిటీ పోరాడాలని టి.కృష్ణ, మాధవకృష్ణలు సూచించారు. ఎన్నికలో సీపీఐ, రైతు సంఘం మండల ప్రతినిధులు డి.రాజు, బాలరాజు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

కృష్ణగిరి: ఉపాధి హామి పథకం పనులకు గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆమన ఉపాధి సిబ్బందితో మాట్లాడారు. గత కొన్ని రోజులుగా కూలీల సంఖ్య తగ్గుతోందన్నారు. రైతులకు ఉపయోగపడేలా కాలువల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేసిన పనులకు సంబంధించి బిల్లులకు ఎప్పటికప్పుడు మస్టర్లను అప్‌లోడ్ చేయాలని ఏపీఓలు అబ్దుల్‌షుకూర్, శ్రీనివాసులును ఆదేశించారు.

సద్వినియోగం చేసుకోండి

ఎమ్మిగనూరురూరల్: రైతులకు అందిస్తున్న వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడివెళ్ల గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన ఆధ్వర్యంలో ఉత్పాదకత పెంపుదల (పీఎస్ఐ) కార్యక్రమంలో భాగంగా మైక్రో వాటర్‌షెడ్ పథకం కింద రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, ఆయిల్ ఇంజిన్‌ను అందజేశారు. సర్పంచ్ రంగస్వామి, సోగనూరు భీమిరెడ్డి, పీఓ వలిబేగ్ తదితరులు ఉన్నారు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

హొళగుంద: ఇంగళదహాల్ గ్రామాభివృద్ధికి కృషి చేసిన దివంగత కే.సీ.తిమ్మారెడ్డి సేవలు మరవరానివని ఆయన వారసులు కార్తీక్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జున, కెంచప్ప అన్నారు. శుక్రవారం ఇంగళదహాల్‌లో కేసీ తిమ్మారెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. టోర్నీ విజేతకు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.25 వేలు నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం జరిగిన క్రికెట్ పోటీలో మద్దిలింగదహళ్లి జట్టుపై పెద్దహరివాణం జట్టు గెలుపొందింది.

బీమా నమోదు పక్కాగా చేపట్టండి

ఆలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి అర్హుల నమోదు సర్వే పక్కాగా చేపట్టాలని వలంటీర్లను ఆదేశించినట్లు ఎంపీడీఓ అల్లబకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు ఉన్న వైఎస్సార్ బీమా అర్హుల పునరుద్ధరణ, కొత్తగా అర్హుల నమోదు సర్వే ప్రక్రియ ఈ నెల 7వ తేదిలోపు పూర్తి చేయాలన్నారు. రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు.

కు.ని ఆపరేషన్లు ప్రారంభం



బాలింతతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో గత 8 నెలలుగా నిలిచిపోయిన కుటుంబ నియంత్రణ (కు.ని.) శస్త్రచికిత్సలు ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవతో మళ్లీ ప్రారంభయ్యాయి. శుక్రవారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రభుత్వాసుపత్రిని సందర్శించి, ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాధారణ బదిలీల్లో భాగంగా గైనకాలజిస్ట్ కల్పన ఆలూరుకు బదిలీ కావడంతో ఆపరేషన్లు నిలిచిపోయాయన్నారు. కు.ని ఆపరేషన్ల కోసం బాలింతలు ఆదోని, కర్నూలు ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి గైనకాలజిస్ట్ డాక్టర్ కల్పనను పత్తికొండకు నియమించారని చెప్పారు. దీంతో శుక్రవారం నుంచి ఆపరేషన్లు ప్రారంభించారు. ఇకపై ప్రతి శుక్రవారం పత్తికొండ ప్రభుత్వాసుపత్రిలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరుగుతాయని వెల్లడించారు. అలాగే ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. డాక్టర్లు కల్పన, హారిక, ఎంపీపీ నారాయణదాసు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు



ఎమ్మిగనూరు 34వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్ అందిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించి, వారి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 34వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో సంక్షేమ పథకాలతో లబ్ధిపొందిన కుటుంబాలను కలిసి బుక్‌లెట్లు ఇచ్చి ఆయా పథకాల అమలును అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు అందుకునే వృద్ధులు, చేనేత కార్మికులతో పాట పలువురు సంక్షేమ పథకాల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నారని వివరించారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణాలను సత్వరం పూర్తి చేయించి స్వచ్ఛ పట్టణంగా మార్చేందుకు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కృషి చేస్తున్నారన్నారు. సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు జీడీపీ నుంచి పట్టణానికి మంచినీటిని అందించేలా రూ.142 కోట్లతో పైప్‌లైన్లు ఏర్పాటు చేయనున్నారని వివరించారు. వార్డు పరిధిలో కొన్ని వీధుల్లో సీసీ రోడ్లు, మంచినీటి కొళాయిలు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ విశ్వనాథ్‌రమేష్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలపై ఫిర్యాదు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో మాల దాసరి కులం వారు తప్పుడు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలను పొంది ఉద్యోగాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకొని, ఆ కుల ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి నర్సన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

హొళగుంద: హొన్నూరులో వైఎస్సార్‌సీపీ నాయకుడు కురువ రామన్న (55) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఇంటివద్ద గుండెపోటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆదోనికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య నీలమ్మ ఉంది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు శుక్రవారం భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

సబ్సిడీ విత్తనాల పంపిణీ

తుగ్గలి: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని వైస్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, రఘు అన్నారు. వారు శుక్రవారం జొన్నగిరిలో సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు.

టీడీపీ కుట్రలు ఫలించవు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్రరెడ్డి

దేవనకొండ: అధికార దాహంతో టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా ప్రజలు మాత్రం వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సురేంద్రరెడ్డి, తెర్నెకల్ సర్పంచ్ అరుణకుమార్ తెలిపారు. దేవనకొండ మండలం తెర్నెకల్ గ్రామంలో శుక్రవారం వారు మాట్లాడుతూ.. అధికారం వచ్చి పట్టి టీడీపీ నాయకులు సీఎం జగన్‌పై, పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చౌకబారు విమర్శలు చేయడాన్ని ఖండించారు. పత్తికొండలో నిర్వహించిన సీఎం సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని, జననేతపై అభిమానంతో రైతులు భారీ ఎత్తున తరలివచ్చారన్నారు. సభ విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమాంబ, ఈరన్న, మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు నామాల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.